సాక్షి కామారెడ్డి

సోమవారం, 7, ఆగస్టు, 2023



వంతెనకు మోక్షమేది?

సింగితం వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా.. పనులు చేపట్టకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు.

- 9లో ▸



ఘనంగా తీజ్

సదాశివనగర్ మండలంలోని పలు తండాలలో ఆదివారం తీజ్ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /23.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అడపాదడపా అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి సాయిలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్, ప్రతినిధులు దేవరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, జుగల్ కిషోర్, లక్ష్మణ్, సాయిలు పాల్గొన్నారు.

కొయ్యగుట్టతండా జీపీలో 35 ఇళ్ల విలీనం


బాన్సువాడ రూరల్: కొయ్యగుట్ట తండా గ్రామ పంచాయతీలో 35 విలీనం చేస్తూ ఆదివారం అసెంబ్లీలో తీర్మానం చేశారు. గతంలో తాడ్కోల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండే తండాలోని 35 ఇళ్లను.. బాన్సువాడ పట్టణానికి శివారులో ఉండడంతో బల్దియాలో విలీనం చేశారు. దీంతో ఈ 35 కుటుంబాలు ఉపాధి హామీ పథకానికి దూరమయ్యాయి. ఓవైపు ఉపాధి దూరమై.. మరోవైపు పన్నులు భారంగా మారడంతో తండావాసులు విషయాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సూచన మేకు 2018లో మున్సిపల్ కార్యవర్గం తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదించింది. ఈ 35 ఇళ్లు కొయ్యగుట్ట తండా పంచాయతీకి అతి సమీపంలో ఉండడంతో.. ఆ తండాలో విలీనం చేయాలని కోరారు. దీనికి అసెంబ్లీ ఆదివారం ఆమోదం తెలిపింది. అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

గుండెపోటుతో సీసీఆర్‌బీ ఎస్సై మృతి



ఖలీల్‌వాడి (నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సీసీఆర్‌బీ ఎస్సై దయానంద్‌రావు(57) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన శనివారం రాత్రి తన స్వస్థలమైన నిర్మల్‌కు వెళ్లారు. అక్కడ రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు. దయానంద్‌రావు 1983లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. 2018లో ఎస్సైగా ప్రమోషన్ పొందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియలలో నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ జయ్‌రామ్ గోపాల్ పాల్గొన్నారు.

బీఎఫ్ఐ సభ్యుడిగా రాజేందర్‌రెడ్డి



నిజామాబాద్ నాగారం(నిజామాబాద్ అర్బన్): బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఎఫ్ఐ) సభ్యుడిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎం.రాజేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన సమాఖ్య కార్యవర్గ సమావేశంలో ఆయనను జాతీయ సభ్యుడిగా నియమించారు. ఆయన 20 ఏళ్లుగా జిల్లాలో బాస్కెట్‌బాల్ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యులుగా పని చేస్తున్నారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి



బిచ్కుంద: తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం ఎంపీ బీబీ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, జీవో–544 ప్రకారం ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఈసారికి.. ఇదే చివరిసారి!?

- అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా
- త్వరలో శాసనసభ ఎన్నికలు
- జనం మధ్యలోకి వెళ్లనున్న నేతలు

శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆదివారం ముగిశాయి. ప్రస్తుత శాసనసభ కాలం మరో నాలుగు నెలల్లో ముగిసిపోనుంది. త్వరలో అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో ఈ దఫాలో ఇవే చివరి సమావేశాలని భావిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎమ్మెల్యేలంతా ఇక జనంలోనే ఉండనున్నారు. ప్రజల మద్దతు కోసం ప్రయత్నించనున్నారు.

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో నాలుగు నియోజకవర్గాలున్నాయి. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్ కాగా.. కామారెడ్డి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్‌గా, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ప్యానెల్ స్పీకర్‌గా వ్యవహరించారు. స్పీకర్ స్థానంలో ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల కాలంలో జరిగిన శాసనసభ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ప్రొటెం స్పీకర్‌గా హన్మంత్ సింధేకు అప్పుడప్పుడు అవకాశం వచ్చింది. ప్రభుత్వ విప్ హోదాలో గంప గోవర్ధన్ తన పాత్రను నిర్వర్తించారు. అవకాశం చిక్కినపుడల్లా ఆయన కామారెడ్డి నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించారు. ఇక ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కూడా ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లలో తన నియోజక వర్గంలోని సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారం కోసం ప్రయత్నించారు.

జనం మదిని గెలిచేందుకు..

ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. వచ్చే నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికల్లో తిరిగి పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు చాలాకాలంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో జనంలో తిరుగుతున్నారు. అయితే ఆఖరి అసెంబ్లీ సమావేశాలు ముగిసిన నేపథ్యంలో ఇక అందరూ నియోజకవర్గాల్లో పూర్తిస్థాయి సమయం కేటాయించనున్నారు. షెడ్యూల్ వెలువడితే ఎన్నికల కోడ్ వస్తుందని, ఆలోపు అన్ని అభివృద్ధి పనులను ప్రారంభించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడం, పూర్తయిన వాటిని ప్రారంభించడం వంటివాటిపై దృష్టి పెట్టనున్నారు. అటు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఇటు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యేలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. గ్రామాలు, మండలాలవారీగా పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని, కార్యక్రమాలు చేపట్టనున్నారు. పార్టీ శ్రేణులకు దగ్గరవుతూ, ఇతర పార్టీల్లోని నేతలను తమ వైపు తిప్పుకునేందుకు వలసలపై దృష్టి సారించారు. వచ్చే ఎన్నికల్లోనూ తామే బరిలో నిలుస్తామన్న నమ్మకంతో ఉన్న ఎమ్మెల్యేలు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు.



అసెంబ్లీలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు జాజాల, గంప, సింధే

మరోసారి అవకాశం దక్కేనా?

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా అధికార పార్టీకి చెందినవారే.. ఆయా స్థానాల్లో వారే పోటీ చేస్తారని భావిస్తున్నారు. బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డే తిరిగి పోటీ చేస్తారని అప్పట్లో తెలంగాణ తిరుమల ఆలయ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో పోచారం తిరిగి పోటీ చేస్తారన్న విషయం స్పష్టమైంది. ఇటీవల జుక్కల్ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి కేటీఆర్ అక్కడి ఎమ్మెల్యే సింధేను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరడంతో ఆయనకు సైతం మరోసారి అవకాశం దక్కడం ఖాయమని తెలుస్తోంది. ఎల్లారెడ్డిలో మంత్రి హరీశ్‌రావు పర్యటన సందర్భంగా సురేందర్ కష్టపడే వ్యక్తి అని, ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ తిరిగి సురేందర్‌నే బరిలో నిలపవచ్చని భావిస్తున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వరుస విజయాలు సాధించారు. నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. అయితే ఇటీవల సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. సీఎం పోటీ చేయకపోతే గంప గోవర్ధనే తిరిగి బరిలో నిలిచే అవకాశాలున్నాయి.

రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు శంకుస్థాపన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు, రైల్వే అధికారులు

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- పాల్గొన్న రైల్వే అధికారులు, జిల్లా బీజేపీ నేతలు

కామారెడ్డి టౌన్: దేశాభివృద్ధే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా 27 రాష్ట్రాల్లో 508 రైల్వే స్టేషన్‌ల పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ స్కీంలో భాగంగా కామారెడ్డి రైల్వే స్టేషన్‌ను రూ. 39.90 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. కామారెడ్డి స్టేషన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంటన్నర పాటు సాగిన ప్రధాని ప్రసంగాన్ని ఆన్‌లైన్‌లో వీక్షించారు. అనంతరం అరుణతార మాట్లాడుతూ ప్రధానమంత్రి ముందుచూపుతో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నారన్నారు. తెలంగాణలో 21 రైల్వే స్టేషన్లను రూ. 914 కోట్లతో ఆధునీకరిస్తున్నారని రైల్వే ఏడీఆర్‌ఎంలు శశాంక్, రామకృష్ణ తెలిపారు. కామారెడ్డి స్టేషన్ సైతం అన్ని హంగులతో అభివృద్ధి అవుతుందన్నారు. దేశంతో పాటు తెలంగాణను అభివృద్ధి చేయడం బీజేపీ, మోదీతోనే సాధ్యమని ఆ పార్టీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాసం, డ్రాయింగ్, దేశభక్తి పాటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో రైల్వే ఏడీఆర్‌ఎంలు శశాంక్, రామకృష్ణ, బీజేపీ కామారెడ్డి, ఎల్లారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జీలు వెంకటరమణారెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు శ్రీనివాస్, కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్‌లు, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్, రవి, సురేష్, గంగారెడ్డి, వీరేశం, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

‘ఏనుగు రవీందర్‌రెడ్డిని నమ్మొద్దు’

కామారెడ్డి అర్బన్: ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు నమ్మవద్దని ఆ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు ఆయన ప్రచారం చేసుకున్నారని, ఆదివారం కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల ప్రారంభోత్సవంలో బీజేపీ నేతలతో కలిసి పాల్గొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండాలని, రాజకీయంగా ఆయనను నమ్మి మోసపోవద్దని మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు.

సీఎంను సన్మానించిన స్పీకర్



సీఎం కేసీఆర్‌ను సన్మానిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆదివారం శాసనసభ భవనంలోని తన చాంబర్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకుని లక్షలాది మంది రైతులకు మేలు చేస్తున్న సీఎంకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపానని స్పీకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – బాన్సువాడ

గంప గెలవలేడనే తెరపైకి కేసీఆర్ పేరు

- ఎవరు పోటీ చేసినా కాంగ్రెస్‌దే గెలుపు
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరిస్తున్నారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పోటీచేస్తే ఓడిపోతారన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఇక్కడినుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోందన్నారు. హాథ్ సే హాథ్ జోడో, గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఉగ్రవాయిలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలను నిలువరించడానికి కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ నినాదం తెరపైకి వచ్చిందన్నారు. సీఎంను పోటీకి ఆహ్వానించానని గంప గోవర్ధన్ అనడం ఆయన అసమర్థతకు నిదర్శనమన్నారు. గజ్వేల్‌లోని గ్రామాలను నీట ముంచి, ప్రస్తుతం కామారెడ్డిని ముంచడానికి వస్తున్నారా అని సీఎంను ప్రశ్నించారు. కామారెడ్డినుంచి కేసీఆర్, కేటీఆర్, కవితలలో ఎవరు పోటీ చేసినా కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, అమ్ముల ముకుందం, గోనె శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, నౌసిలాల్, చిన్న మల్లారెడ్డి సర్పంచ్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఉగ్రవాయిలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



వృద్ధులతో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

గద్దర్ గురుతులు

- ఉమ్మడి జిల్లాలో మారుమోగిన విప్లవ పాటలు
- ఎన్నో సభల్లో ఆడిపాడిన ప్రజాయుద్ధ నౌక
- నివాళులు అర్పించిన అభిమానులు

సాక్షి, కామారెడ్డి: ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు ఉమ్మడి జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. అప్పట్లో పీపుల్స్‌వార్ ఉద్యమం కొనసాగిన కాలంలో ఎన్నో సభల్లో ఆయన పాల్గొన్నారు. చెన్నారెడ్డి ప్రభుత్వం నక్సలైట్లపై నిషేధం ఎత్తివేసినపుడు నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన పాట పోటెత్తింది. చంద్రబాబు ప్రభుత్వం నక్సలైట్లపై తీవ్ర నిర్బంధం విధించినపుడు కూడా ఆయన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలు సమావేశాలకు హాజరయ్యారు. తెలంగాణ కోసం తెలంగాణ జనసభ, తెలంగాణ ప్రజాఫ్రంట్, తెలంగాణ ఐక్యవేదిక వంటి సంస్థలు నిర్వహించిన సభల్లోనూ ఆయన గొంతు వినిపించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన తమ ఊరికి రావాలంటూ ఎన్నో ఊళ్ల నుంచి ఆహ్వానాలు వెళ్లాయి. ఆయన ఎన్నో సభల్లో పాల్గొన్నారు. కానిస్టేబుల్ కిష్టయ్య ఆత్మహత్య చేసుకున్న తర్వాత శివాయిపల్లికి వచ్చి కిష్టయ్య తల్లిని ఓదార్చారు. భిక్కనూరులో తెలంగాణ జేఏసీ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన పోరాటంలో భాగంగా కామారెడ్డిలో నిర్వహించిన తెలంగాణ జర్నలిస్టుల సదస్సులోనూ గద్దర్ పాల్గొన్నారు. అనంతర కాలంలోనూ పలు సభల్లో ఆయన పాల్గొన్నారు.

ఊరూరా విప్లవ పాటల హోరు..

జననాట్య మండలి పాట అంటేనే గద్దర్ పాటగా ప్రాచుర్యం ఉండేది. టేపు రికార్డులు వచ్చిన తర్వాత గద్దర్ పాటల క్యాసెట్లు ప్రతి ఊళ్లో, ప్రతి ఇంట్లో కనిపించేవి. ఏ ఊరికి వెళ్లినా హోటల్ దగ్గర గద్దర్ పాటలు వినిపించేవి. అనేక సామాజిక అంశాలపై ఆయన పాడిన పాటలను జనం ఏళ్ల పాటు విన్నారు. గద్దర్ పాటలు విన్నవారిని అప్పటి ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలూ ఉన్నాయి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ‘పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా’ అంటూ ఆయన పాడిన పాట అందరి హృదయాలను హత్తుకుంది. ఉద్యమ సమయంలో ఆ పాట అన్ని వేదికలపై హోరెత్తింది. ఆయన పాటలతో ఎంతో మంది ఉద్యమంలోకి వచ్చారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను బలిపెడుతున్న వారిని అడ్డుకోవడానికి ‘చావొద్దు బిడ్డా’ అంటూ ఆయన పాటలతో ధైర్యం చెప్పారు. పోరాడి సాధించాలని పదేపదే చెప్పేవారు.

జిల్లా అంతటా తిరిగిన ప్రజాయుద్ధ నౌక

విప్లవోద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం దాకా గద్దర్ ఉమ్మడి జిల్లా అంతటా తిరిగారు. 2108లో జుక్కల్‌లో బీఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో రాహుల్ గాంధీ సభకు రెండు రోజుల ముందు గద్దర్ కామారెడ్డికి వచ్చారు. కాంగ్రెస్ నాయకులను కలసి మాట్లాడారు. బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, ఆర్మూర్ తదితర ప్రాంతాల్లోనూ గద్దర్ పర్యటించారు. కాగా గద్దర్‌తో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రజా ఉద్యమకారులు, సామాజిక ఉద్యమకారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గద్దర్ మరణ వార్త విన్నవారంతా ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. గద్దర్ మృతికి తెలంగాణ రచయితల వేదిక తీవ్ర సంతాపాన్ని తెలిపింది.



కామారెడ్డిలో గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న అభిమానులు



భిక్కనూరులో తెలంగాణ జేఏసీ శిబిరం వద్ద మాట్లాడుతున్న గద్దర్ (ఫైల్)

మంచి కళాకారుడిని కోల్పోయాం

తెలంగాణ సమాజం మంచి కళాకారున్ని కోల్పోయింది. విద్యార్థి దశలో మేమంతా కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాం. తర్వాతి కాలంలో ఇద్దరం అనేక వేదికలపైన కలిశాం. ఆయన సమాజాన్ని జాగృతం చేయడంలో ఎప్పుడూ ముందుండేవారు.

– డాక్టర్ జి.లచ్చయ్య, సామాజిక కార్యకర్త

పోరాట యోధుడు..

ప్రజాయుద్ధ నౌక, తెలంగాణ కోసం నిరంతరం పోరాడిన యోధుడు గద్దర్. ప్రజల కోసం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం నిత్యం ప్రజల కోసం పోరాడారు. ఆయన మరణం తీరని లోటు. అన్ని వర్గాల ప్రజల కోసం ఆయన పోరాడారు.

– వీడీదాస్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజలను చైతన్యవంతం చేశారు

గద్దర్ నిరంతరం ప్రజల కోసం పోరాడారు. ఆయన పాడి, ఆడి ప్రజల్ని చైతన్యం చేశారు. విప్లవోద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం దాకా ఆయన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు.

– విజయరామరాజు, డీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు

క్లుప్తంగా

జయశంకర్ సార్ ఆశయాలు సాధించాలి



కామారెడ్డి అర్బన్: జయశంకర్ సార్ ఆశయాలను సాధించేందుకు కవులు, రచయితలు, కళాకారులు బాధ్యతగా కృషి చేయాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా తెరవే ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కర్షక్ బీఎడ్ కళాశాలలో సామాజిక కవి సమ్మేళనం నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెరవే జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి మోహన్‌రాజ్, చంద్రశేఖర్, బానోత్ సురేష్, నాడెం రమేష్‌గౌడ్, వైద్య శేషారావు, కాసర్ల రామచంద్రం, తిరుపతిరావు, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని పిప్రి రోడ్డులో గల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి తెలిపారు. అండర్ –16 విభాగంలో ఉదయ్, అండర్–18 విభాగంలో జావలిన్ త్రోలో జ్ఞానంకుర్ ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 7, 8 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

చెరువు కట్ట ధ్వంసం చేసిన బీఆర్‌ఎస్ నేత



భిక్కనూరు: భిక్కనూరులోని బొబ్బిలి చెరువు కట్టను బీఆర్‌ఎస్ నేత ధ్వంసం చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామపంచాయతీ పక్కన ఉన్న బొబ్బిలి చెరువు ముందర భాగంలో ప్రైవేట్ వ్యక్తికి చెందిన స్థలం ఉంది. ఆ స్థలంలో కొందరు కోకాలు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటూఅద్దె చెల్లిస్తున్నారు. ఈ స్థలాన్ని డెవలప్ చేస్తానని బీఆర్‌ఎస్ నేత స్థలం యజమానితో ఒప్పందం కుదుర్చున్నాడు. రెండు రోజుల క్రితం కట్టను ధ్వంసం చేసి కట్ట స్థలంలోని కొంత భాగాన్ని కలుపుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయం గమనించిన వారు రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

కార్యవర్గం ఎన్నిక



రాజ్‌కుమార్

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ప్రెస్ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్(జర్నలిస్ట్) జిల్లా కార్యవర్గాన్ని గౌరవాధ్యక్షుడు గోవిందరాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి రాజ్‌కుమార్(సాక్షి), ప్రధాన కార్యదర్శిగా కె.వి రమణ(ది హిందూ), ఉపాధ్యక్షుడిగా రతన్(ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా శ్రీనివాస్ కుమార్(నమస్తే తెలంగాణ) ఎన్నికయ్యారు.

యథేచ్ఛగా 'బెల్టు' దందా

- 24 గంటలు అందుబాటులో మద్యం
- వైన్ షాపులను తలపిస్తున్న దుకాణాలు
- పట్టించుకోని అధికారులు



మండలంలోని ఓ బెల్ట్‌షాపు

మాక్లూర్: గ్రామాల్లో వెలసిన బెల్ట్‌షాపులు మద్యం దుకాణాలను తలపిస్తున్నాయి. లైసెన్స్‌లు ఉన్న మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగితే.. బెల్ట్‌షాపులు మాత్రం 24 గంటలు కొనసాగుతాయి. ఉదయం పూట వైన్ షాపులు తెరిచే వరకు, రాత్రి మూసిన తరువాత మద్యం బాటిళ్ల గిరాకితో బెల్ట్‌షాపులు సందడిగా కనిపిస్తున్నాయి. యథేచ్ఛగా బెల్టు షాపుల దందా కొనసాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. బెల్టు షాపుల నిర్వాహకులు బీరు బాటిల్‌కు ఎమ్మార్పీపై రూ.10 నుంచి రూ.20 వరకు, లిక్కర్ క్వార్టర్‌కు రూ.20 నుంచి రూ.30 అధికంగా తీసుకుంటున్నారు. అయినా జనం క్యూ కట్టి కొనుగోలు చేస్తున్నారు. మాక్లూర్ మండలంలో మాక్లూర్, మాణిక్‌భండార్ చౌరస్తా వద్ద వైన్ షాపులు ఉన్నాయి. మండలంలోని మొత్తం 35 గ్రామాలు ఉండగా 41 బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణకు వేలం వేస్తున్నారు. వేలంలో దక్కించుకున్న వారు మాత్రమే మద్యం అమ్మాలి. వైన్‌షాపులు ఉన్న మాక్లూర్, మాణిక్‌భండార్‌లో కూడా బెల్ట్‌షాప్‌లు ఉండటమే కాదు, రూ.లక్ష 95 వేలకు, రూ: 2 లక్షల 10వేలకు వేలం పోవటం విచిత్రంగా చెప్పవచ్చు. అలాగే గుత్ప బెల్ట్‌షాప్ రూ.10 లక్షలు, అమ్రాద్ రూ.8 లక్షలు, మదన్‌పల్లి రూ.6.5 లక్షలు, ఒడ్డెట్‌పల్లిలో రూ.4.60 లక్షలకు బెల్టుషాపులను గత సంవత్సరం దక్కించుకున్నారు. ఇవి ఈ ఏడాది దసరా వరకు కొనసాగుతాయి. కొత్తగా వేలం పాటలు కూడా మళ్లీ అప్పుడే జరుగుతాయి. గ్రామాల్లో 24 గంటలపాటు మద్యం అందుబాటులో ఉంచటంతో యువత, పిల్లలు మద్యానికి బానిసలు అవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు.



బెల్ట్‌షాప్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన లిక్కర్

మద్యానికి బానిస అవుతున్నారు



గ్రామాల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉండటంతో యువత మద్యానికి బానిస అవుతున్నారు. ఒకరిని చూసి ఒకరు అన్నట్టు పాఠశాలకు వెళ్లే పిల్లలు కూడా బెల్ట్‌షాపులో దొంగచాటుగా కొని మందు తాగుతున్నారు. ప్రభుత్వం బెల్ట్ షాప్‌లను తొలగించాలి. బెల్ట్‌షాపులు ఇలాగే కొనసాగుతే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయి.

– డి సవిత, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

భయం.. భయంగా విధులు



శిథిలావస్థలో ఉన్న రెంజల్ సబ్‌స్టేషన్ భవనం



పగుళ్లు ఏర్పడిన తాడ్‌బిలోలి సబ్‌స్టేషన్ గోడ

- శిథిలావస్థలో సబ్‌స్టేషన్ భవనాలు

రెంజల్: ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. గోడలకు పగుళ్లు ఏర్పడి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. దీంతో వర్షం పడినప్పుడు సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఎడపల్లి ఏడీఈ ఆపరేషన్ సర్కిల్ పరిధిలో ఎడపల్లి, రెంజల్, బోధన్ రూరల్ మండలాలు ఉన్నాయి. పలు గ్రామాల్లో నిజాం కాలంలో నిర్మించిన వందేళ్ల నాటి భవనాల్లో కార్యాలయాలు ఉన్నాయి. గోడలకు పగుళ్లు ఏర్పడగా, మరి కొన్ని పైకప్పులు సక్రమంగా లేక ఊరుస్తుండటంతో ఆఫీసులోని పలు రకాల డాక్యుమెంట్లు దాచుకునేందుకు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. పై పెచ్చులు ఊడిపడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గృహావసరాలు, వ్యవసాయ రంగాలకు 24 గంటల అత్యవసర సర్వీసు అందిస్తున్నా విద్యుత్ సిబ్బందికి రక్షణ లేకుండాపోయింది. గ్రామాలకు దూరంగా ఉన్న పాడు బడిన సబ్‌స్టేషన్ భవనాలలో కాలం వెళ్లదీస్తున్నారు. కార్యాలయాల చుట్టూ అటవీ ప్రదేశాలు ఉండటంతో పాములు సంచరిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. దీనికి తోడు సబ్‌స్టేషన్ వద్దకు ఉన్న రోడ్లు చినుకు పడితే బురదమయంగా మారుతున్నాయి. సిబ్బందితో పాటు కార్యాలయాలకు వచ్చే వినియోగదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుంది. ప్రధాన రహదారుల నుంచి సబ్‌స్టేషన్‌ల వద్దకు మట్టి రోడ్లు ఉండటంతో రాకపోకలకు తంటాలు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఎడపల్లి సర్కిల్ పరిధిలో పాత సబ్‌స్టేషన్ భవనాలను గుర్తించి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాం. జిల్లా అధికారుల పరిశీలనలో ఉన్నాయి. నిధులు మంజూరైతే నూతన భవన నిర్మాణాలను చేపడతాం.

– లక్ష్మణ్‌నాయక్, ఏడీఈ

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అజ్మీర ఇందును సన్మానిస్తున్న అధ్యాపకులు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగమోహన్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన సుద్దపల్లి క్రీడాకారిణి అజ్మీర ఇందు జూనియర్ ఆసియా సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడంతో ఆదివారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమకు నచ్చిన క్రీడలో పాల్గొంటే శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారన్నారు. అజ్మీర ఇందు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఆసియా క్రీడలు చైనాలోని పింగ్‌టాన్ జరుగుతాయన్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ స్వప్న, సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల రాష్ట్ర సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్ వేముల మానికను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధణవేణి, వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, అధ్యాపకులు, సాఫ్ట్‌బాల్ బాలుర అకాడమీ కోచ్ నరేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దోమకొండ: దోమకొండలోని బాలుర ఉన్నత పాఠశాల 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకొని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు దోమకొండ సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజు, గణేష్, సామల రాంచంద్రం, మేస్త్రీ శంకర్, శ్రీను, అందె నాగభూషణం, పవన్, ముల్క నాగరాజు, మనోహర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని గాయాలు

కామారెడ్డి క్రైం: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వారిని అదుపు తప్పిన ఆటో ఢీకొని బోల్తా పడింది. దీంతో నలుగురికి గాయాలైన ఘటన కామారెడ్డి ఇందిరా చౌక్‌లో ఆదివారం ఉదయం జరిగింది. ఎల్లారెడ్డి మండలం అడ్విలింగాలకు చెందిన యూహాన్ అతని ఇద్దరు కుమారులు స్టీఫెన్, రుషితో కలిసి ఇందిరాచౌక్ ప్రాంతంలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ఓ ఆటో వారిని ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. వారితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న రాంబాయి అనే మహిళకు సైతం గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉమ్మడి జిల్లాతో గద్దర్‌కు అనుబంధం



శివాయిపల్లి గ్రామంలో పర్యటిస్తున్న గద్దర్



కామారెడ్డిలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న గద్దర్

భిక్కనూరు: ప్రజా గాయకుడు గద్దర్ భిక్కనూరు మండలానికి పలు మార్లు వచ్చారు. 2010 జనవరి 09న భిక్కనూరులో తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరహారదీక్షలో పాల్గొన్నారు. అదేరోజు శివ్వాయిపల్లిలో తెలంగాణ కోసం ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ కిష్టయ్య ఇంటికి వెళ్లి ఆయన తల్లి లస్మవ్వను ఓదర్చారు.

బాన్సువాడ రూరల్: గద్దర్ 2009లో బాన్సువాడకు వచ్చారు. జైతెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో ప్రెస్‌మీట్ అనంతరం జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో గద్దర్ పాల్గొన్నారు.

సిరికొండ: గద్దర్ మరణంతో మండలంలోని సాహితీపరులు, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2011 నవంబర్ 8న తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గద్దర్ మండల కేంద్రానికి వచ్చారు. సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 2008లో విద్యార్థులకు వ్యాసరచన పోటీల్లో విజేతలకు గద్దర్ బహుమతులు అందజేశారు. గద్దర్ మరణంతో సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నర్సయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు బాలయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.



జుక్కల్: తమ్మినేని పాదయాత్ర ముగింపు సభలో పాల్గొన్న గద్దర్

బోధన్: బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అనంతరం నిజాం షుగర్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రైతులు సభకు గద్దర్ హాజరయ్యారు. బోధన్ అంబేడ్కర్ చౌరస్తాలో నిర్మించిన అమరవీరుల స్తూపాన్ని 2013 ఏప్రిల్ 29న గద్దర్ ఆవిష్కరించారు.



తెలంగాణ ఉద్యమ సమయంలో బాన్సువాడలో..



సిరికొండలో విద్యార్థులతో మాట్లాడుతూ..



బోధన్‌లో అమరవీరుల స్తూపం ఆవిష్కరణలో..

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు, CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ఫోన్ : 9041115088 [HA-29901]

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788613]

LOANS

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-189119]

BUSINESS OFFER

■ RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana -2.5L. 50Kg's vacuum packed prawns/day. Rs.600/kg pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/pack. Contact: 8328099433 [WB-19219]

OLD AGE HOME

■ త్రివేణి హోంకేర్ వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి, వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్: 9160900023, 9160900024. [H-189316]

CHANGE OF NAME

■ I, ALOORU RAJESHWAR (OLD NAME) Navipet, Nizamabad. Hence Changed my Name as ALOORI RAJESHWAR S/o. ALOORI LINGANNA (New Name) [Z-799551]

■ I, ALOORU RANI (OLD NAME) Navipet, Nizamabad. Hence Changed my Name as GANDLA RANI (New Name) W/o. ALOORI RAJESHWAR. [Z-799552]

■ I, SUMMAYYA (OLD NAME) Nizamabad. Hence Changed my Name as SUMIYA BEGUM (New Name) W/o. MOHAMMED NAZEERUDDIN. [Z-799553]

PASSPORT MISSING

■ నేను, చక్రాల వంశీకృష్ణ S/o. హన్మంతు R/o. గ్రా: ఘన్‌పూర్ మం: డిచ్‌పల్లి. తేది: 04.08.2023 నేను బైక్‌పై హైదరాబాద్ నుండి డిచ్‌పల్లికి వస్తుండగా నాయొక్క పాస్‌పోర్ట్ ఎక్కడో పడిపోయినది. పాస్‌పోర్ట్ నెం. P5333877 దొరికినవారు సంప్ర။ 9848235896. [Z-799554]

WANTED

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221479]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్: 9640258899, 9640468899. [HA-189314]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

అదుపు తప్పిన లారీ



ఇందల్వాయి: మండలంలోని దేవితండా జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఓ లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. నాగాపూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడగా టోల్‌ప్లాజా సిబ్బంది వచ్చి లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయట పడ్డారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

నవీపేట: మండలంలోని మహంతం గ్రామంలో ఆదివారం పిచ్చి కుక్కలు రెచ్చిపోయాయి. గుంపుగా స్వైరవిహారం చేసిన కుక్కలు చిన్న పిల్లలతో పాటు పశువులపై దాడి చేశాయి. దాడిలో నీరడి కార్తికేయ(9), మెట్టు వైష్ణవి(8), మెట్టు సుజాత గాయపడ్డారు. క్షతగాత్రులను నవీపేట ఆస్పత్రికి తరలించారు. కుక్కల దాడిలో కొన్ని పశువులు స్వల్పంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

ఎల్లారెడ్డిరూరల్: చెరువులో నుంచి గేదెలను బయటకు తీసుకు వచ్చేందుకు వెళ్లిన కాపరి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన నాగిరెడ్డిపేట మండలం అచ్చాయిపల్లి శివారులో చోటు చేసుకుంది. వివరాలు.. ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన మంద్రు ప్రకాశ్ (32) గేదెలను మేపేందుకు శనివారం అచ్చాయిపల్లి శివారుకు వెళ్లాడు. చెరువులోకి వెళ్లిన గేదెలను బయటకు తోలేందుకు వెళ్లి నీట మునిగి చనిపోయాడు. సాయంత్రం వరకు ప్రకాశ్ ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా చెరువు కట్టపై దుస్తులు కనిపించాయి. శనివారం చెరువులో గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం చెరువులో ప్రకాశ్ మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

పాముకాటుతో మహిళ..



గంగవ్వ (ఫైల్)

పెద్దకొడప్‌గల్: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జోగు గంగవ్వ(62) ఆదివారం పత్తి పంటలో కలుపు తీయడానికి కూలీ పనులకు వెళ్లింది. కలుపు తీస్తుండగా పాము కరిచింది. వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స చేసి, బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడి మృతి



సిద్ధరాములు (ఫైల్)



ప్రమాదస్థలంలో పడి ఉన్న బైక్

భిక్కనూరు: మెదక్ జిల్లా రామాయంపేట గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భిక్కనూరు వార్డు సభ్యుడు మృతి చెందగా ఆయన భార్య, కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. భిక్కనూరు నాలుగో వార్డు సభ్యుడు బల్యాల సిద్ధరాములు (45) తన భార్య మాధవి, కుమార్తె సుస్మితతో కలిసి తన అత్తగారిల్లు మెదక్ పట్టణానికి బైక్‌పై బయలుదేరాడు. రామాయంపేట బైపాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ నుంచి కామారెడి వైపు వస్తున్న టాటా ఏసీ వాహనం అదుపు తప్పి రోడ్డుకు మరోవైపు దూసుకొచ్చి సిద్ధరాములు బైక్‌ను ఢీకొంది. సిద్ధరాములు, మాధవి, సుస్మితలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే టాటా ఏసీ వాహనం నడుపుతున్న భిక్కనూరుకు చెందిన బల్యాల నవీన్‌కు కూడా తీవ్ర గాయాలయాయ్యి. వెంటనే వీరిని రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడి వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా సిద్ధరాములు మృతి చెందాడు. బల్యాల సిద్ధరాములు మృతికి కారణమైన టాటా ఏసీ డ్రైవర్ నవీన్ వరుసకు బావ బావమర్దిలు అవుతారు.

నెమలి గుట్ట తండాలో విషాదం



ప్రమీల (ఫైల్)

మాచారెడ్డి: మండలంలోని నెమలి గుట్ట తండాకు చెందిన బుక్య ప్రమీల(22)ను ఆమె ప్రియుడు హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఆదివారం ట్యాంకర్ కింద తోసేసి హత్య చేయడంతో తండాలో విషాదం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ప్రమీల, మండలంలోని రోడ్డు బండ తండాకు చెందిన తిరుపతి కొద్ది రోజులుగా ప్రేమించుకుంటున్నారు. ప్రమీల బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. తిరుపతి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని ప్రమీల తిరుపతిపై ఒత్తిడి తెచ్చింది. ఇద్దరు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ గొడవ పడ్డారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న వాటర్ ట్యాంకర్ కిందకు తిరుపతి ప్రమీలను తోసేయగా అక్కడికక్కడే మృతి చెందింది. తిరుపతి పరారీలో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వివాహేతర సంబంధానికి ఒప్పుకోలేదని కత్తితో దాడి

ఖలీల్‌వాడి: వివాహేతర సంబంధానికి ఒప్పుకోలేదని మహిళపై నీలేష్ అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం నిజామాబాద్ నగరంలో చోటు చేసుకుంది. రెండో టౌన్ ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు.. నగరంలోని కసాబ్‌గల్లీకి చెందిన స్వాతి, భర్త ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటుంది. స్వాతికి నీలేష్ అనే వ్యక్తితో గతంలో వివాహేతర సంబంధం ఉండేది. వారి మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. స్వాతిని భర్తను వదిలి తన వద్దకు రావాలని తరుచూ వేధించేవాడు. దీనికి మహిళ ఒప్పుకోకపోవడంతో, ఆదివారం ఉదయం కసాబ్‌గల్లీలో ఒంటరిగా ఉన్న స్వాతిపై, నీలేష్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. కత్తితో నాలుగు పోట్లు పొడిచాడు. స్థానికులు అక్కడికి చేరుకోగానే నీలేష్ పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలిని స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం మహిళ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. నిలేష్ మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందినవాడని పోలీసులు తెలిపారు.


యువతి ఆత్మహత్యాయత్నం

మద్నూర్: డోంగ్లీ మండలంలోని ఒక గ్రామానికి చెందిన డిగ్రీ చదువుతున్న యువతి ఆదివారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానిక ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న యువతి మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో పడిపోవడంతో స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విద్యార్థినికి ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు చెప్పారు.

ఠాణాలో ఒకరు..

రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన కుక్కల రవి ఆదివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. డబుల్ బెడ్‌రూం ఇల్లు రాలేదని రామారెడ్డి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆత్మహత్యకు యత్నించినట్లు రవి భార్య వాపోయింది. దీనిపై ఎస్సై సుధాకర్‌ను వివరణ కోరగా.. అన్నారంలోనే గడ్డిమందు తాగి స్టేషన్‌కు వచ్చారని చెప్పారు. భార్యాభర్తల గొడవలకు తోడు, డబుల్ బెడ్ రూం ఇల్లు రాలేదనే కారణంగా గడ్డి మందు తాగి స్టేషన్‌కు వచ్చారన్నారు. బాధితుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాలుడిని ఢీకొన్న తుఫాన్ వాహనం



నాగిరెడ్డిపేట: మండల కేంద్రం గోపాల్‌పేట బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఓ బాలుడిని తుఫాన్ వాహనం ఢీకొంది. మండలంలోని తాండూర్‌కు చెందిన కుమ్మరి శ్రీనివాస్ కొంతకాలంగా గోపాల్‌పేటలో టిఫిన్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శ్రీనివాస్ కుమారుడు తనుష్ గోపాల్‌పేటలో రోడ్డు దాటుతుండగా తుఫాన్ అతనిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన తనుష్‌ను చికిత్స నిమిత్తం గోపాల్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు హైద్రాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన తుఫాన్ వాహనాన్ని మండలంలోని తాండూర్ శివారులో వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజు ప్రమాదానికి కారణమైన తుఫాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.